క్లుప్తంగా

జీరుపేటలో పిచ్చికుక్క స్వైరవిహారం

తగరపువలస : భీమిలి జోన్ 2వ వార్డు జీరుపేటలో శుక్రవారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసి పలువురిపై దాడి చేసింది. జీరు గంగాభవాని అనే వివాహిత చేయి, కాలిపై తీవ్రంగా గాయపరిచింది. వెంటనే ఆమెను భీమిలి కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. గ్రామంలో పిచ్చికుక్క పలువురిపై దాడి చేయడంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. వీధికుక్కల నియంత్రణకు జీవీఎంసీ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వ స్థలంలో హెచ్చరికల బోర్డులు

తగరపువలస : భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీలోని సర్వే నంబర్ 180/1,2లో శుక్రవారం రెవెన్యూ సిబ్బంది హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్థలంతో పాటు గెడ్డలను కూడా ఆక్రమించి నిర్మాణాలు జరుగుతున్నట్టు గుర్తించి ఈ బోర్డును ఏర్పాటు చేశామని, నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నగరంలో కార్డన్ సెర్చ్



తనిఖీ చేస్తున్న పోలీసులు

డొండపర్తి : నేర నియంత్రణలో భాగంగా పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. పీఎం పాలెం, టూటౌన్, మహారాణిపేట పోలీస్‌స్టేషన్ల పరిధి పలు ప్రాంతాలను జల్లెడ పట్టారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాలతో డీసీపీ-1 కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 150 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది గురువారం అర్ధరాత్రి, శుక్రవారం తెల్లవారు జామున మారికవలస, కొబ్బరితోట, సాలిపేట ప్రాంతాల్లో ఒకే సమయంలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఇందులో సరైన ధ్రువపత్రాలు లేని 31 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు.

దేవాలయాన్ని పరిశీలించిన అధికారులు



గంభీరంలో ఆలయాలను పరిశీలిస్తున్న దేవదాయ శాఖ అధికారులు

ఆనందపురం : మండలంలోని గంభీరంలో గల బంగారమ్మ తల్లి గుడిని దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరీష, సింహాచలం దేవస్థానం ఈఈ శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. బంగారమ్మతల్లి గుడి శిథిలావస్థకు చేరుకోవడంతో పునర్నిర్మాణానికి టీటీడీ శ్రీవాణి ట్రస్ట్‌కు గ్రామస్తులు దరఖాస్తు చేశారు. ఈ మేరకు అధికారులు దేవాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా దేవాలయానికి నిధుల మంజూరుకు సిఫారసు చేస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బొట్టా ధనలక్ష్మి, బొట్టా రామకృష్ణ, శ్రీను, పెదరాజునాయుడు పాల్గొన్నారు.

మాక్సిల్లో ఫేషియల్ సర్జరీపై వర్క్‌షాపు



వర్క్ షాపులో పాల్గొన్న ప్రముఖులు

తగరపువలస: సంగివలస అనిల్ నీరుకొండ మెడికల్ ఇనిస్టిట్యూట్‌లో రెండు రోజుల పాటు జరగనున్న ఓరల్ అండ్ మాక్సిల్లో ఫేషియల్ సర్జరీ వర్క్‌షాపు శుక్రవారం ప్రారంభమైంది. అనిల్ నీరుకొండ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్, అసోసియేషన్ ఆఫ్ ఓరల్ మాక్సిల్లో ఫేషియల్ సర్జన్స్ ఆఫ్ ఇండియా, తమిళనాడు, పుదుచ్చేరి బ్రాంచ్‌లు సంయుక్తంగా ఈ వర్క్‌షాపు నిర్వహిస్తున్నారు. జాతీయస్థాయిలో వైద్య నిపుణులు ప్రభు, అరుణ్‌కుమార్, తిరునీలకందన్, పి.సురేష్‌కుమార్, ప్రదీప్ దేవదాస్ మాక్సిల్లో ఫేషియల్ ట్రామా నిర్వహణలో శస్త్రచికిత్సా నైపుణ్యాలను బోధించారు. మెడికల్ కళాశాల డీన్ డాక్టర్ పీవీ సుధాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.వంశీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సంపూర్ణ ఆరోగ్యం

- అదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- గిడిజాల, లక్ష్మీపురం, పాండ్రంగిలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలు



గిడిజాలలో ఆరోగ్య సిబ్బందిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



గిడిజాలలో ఆరోగ్య సురక్ష శిబిరం వద్ద రోగుల రద్దీ

ఆనందపురం : సమాజంలో అందరికీ సంపూర్ణ ఆరోగ్యం అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. అందుకే వైద్యరంగంపై ప్రత్యేకంగా దృష్టి సారించి, ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. మండలంలోని గిడిజాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి సేకరించిన సమాచారంతో శిబిరంలో వైద్య సేవలు అందిస్తున్నారని చెప్పారు. ఆ వివరాలతో నిరంతరం ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకుని వైద్యసేవలు పొందవచ్చునన్నారు. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్సలు, ఇతర వైద్య సేవలు పొందవచ్చని, వైద్య సిబ్బంది అందుకు సహకరిస్తారని వివరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకుంటే పైసా ఖర్చు లేకుండా వైద్యం పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా వైద్యులను, వైద్య సిబ్బందిని, ఆశ కార్యకర్తలను, సచివాలయ సిబ్బందిని సత్కరించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి పద్మ, ఎంపీడీవో అడపా లవరాజు, తహసీల్దారు లోకవరపు రామారావు, సర్పంచ్ షిణగం అప్పలరాజు, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు రెండెకరాల ఆదాయంతో సమానం

తగరపువలస: రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు రెండెకరాల వ్యవసాయ ఆదాయంతో సమానమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. భీమిలి మండలం లక్ష్మీపురం పంచాయతీలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లక్ష్మీపురం పంచాయతీలో 975 కుటుంబాలకు గాను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ అయిదేళ్లలో సంక్షేమ, అభివృద్ధి పథకాల నిమిత్తం రూ.18.50 కోట్లు ఖర్చు చేసిందన్నారు.ఒక్కో కుటుంబానికి సగటును రూ.2 లక్షల లబ్ధి చేకూరిందన్నారు. పేదకుటుంబాలు సైతం దర్జాగా గడుపుతున్నాయన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా వైద్యులు గ్రామాల బాట పట్టారన్నారు.



లక్ష్మీపురంలో గర్భిణులకు సామూహిక సీమంతం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి

కల్యాణమండపం నిర్మాణానికి హామీ

భీమిలి, రేవిడి మధ్య నాగవంశీయులకు అర ఎకరం విస్తీర్ణంలో కల్యాణమండపం నిర్మిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తాటితూరు పంచాయతీలో ఆశ వర్కర్లుగా నియమితులైన గౌతమి, సత్యవతిలకు నియామక పత్రాలు అందించారు. పంచాయతీలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన వైఎస్సార్ పోషకాహార ప్రదర్శనను తిలకించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. అనంతరం వైద్యులు, ఆరోగ్యసిబ్బందిని సన్మానించారు.

కార్యక్రమంలో ఎంపీడీవో పి.వెంకటరమణ, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది ఏబీ మల్లికార్జునరావు, శోభారాణి, గోవింద, అజ్మల్, దుర్గా కల్యాణి, సబిత, ఎర్రితల్లి, ప్రశాంతి, రాజ్‌కుమార్, భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, సర్పంచ్ లచ్చుబుగత జగదీశ్వరరావు, ఎంపీపీ దంతులూరి వాసురాజు, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, మండల సచివాలయాల కన్వీనర్ సరగడ రఘునాథరెడ్డి, గాడు తాతినాయుడు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు జీవీ నారాయణ, తుపాకుల పైడిరాజు, మద్దిల వెంకటరమణ, కె.జోగినాయుడు, చెల్లూరి నగేష్, పొట్నూరు చంద్రశేఖర్, కరుభుక్త వెంకటరమణ, పూసర్ల ఎర్రయ్య, ఉండబట్ల చిన్నారావు,తోట ఎల్లారావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

పాండ్రంగిలో ..

పద్మనాభం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నట్లు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పాండ్రంగిలో శుక్రవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను ఎమ్మెల్యే సందర్శించారు. వైద్యులు, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలను దుశ్శాలువాలతో సన్మానించారు.

వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం

పాండ్రంగిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.20.80లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం రేవిడి యానాద్రి చెరువులో చేప పిల్లలను వదిలారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, పాండ్రంగి సర్పంచ్ పల్లి ఝాన్సీ, రేవిడి ఎంపీటీసీ సభ్యుడు సీర సూరప్పడు, వైఎస్సార్ సీపీ నాయకులు కోన రమణ, కర్రి శ్రీను పాల్గొన్నారు.



పాండ్రంగిలో వెల్‌నెస్ సెంటర్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి



లక్ష్మీపురంలో రోగులకు సేవలు అందిస్తున్న వైద్య నిపుణులు

విజయ గణపతికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి పూజలు

మధురవాడ : గణేష్‌నగర్ శ్రీ విజయ గణపతి పంచాయతన దేవాలయంలో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు నాయకులకు ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పూర్ణకుంభం, మంగళ వాయిద్యాలతో ఆహ్వానం పలికారు. ఇక్కడ గణపతి, సాయిబాబాలకు పూజలు చేయగా అర్చకులు పద్మనాభ శర్మ, నవీన్ శర్మలు వేద ఆశీర్వచనం అందించారు. కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఇంటింటా వైద్య పరీక్షలు

భీమునిపట్నం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా అప్పికొండ వీధి సచివాలయం కన్వీనర్ రాంభుక్త దేవి ఆధ్వర్యంలో భీమిలిలోని మూడో వార్డులో సిబ్బంది శుక్రవారం పర్యటించారు. స్థానికులకు బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేశారు.

అంతరిక్ష వారోత్సవాల సందడి



క్విజ్ పోటీలకు హాజరైన విద్యార్థులు

తగరపువలస : భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాలలో అంతరిక్ష వారోత్సవాలలో భాగంగా రెండో రోజైన శుక్రవారం అయిదు జిల్లాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఇస్రో ఏర్పాటు చేసిన ఉపగ్రహ, రాకెట్ నమూనాలను తిలకించి వాటి పనితీరు గురించి శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. శాస్త్రవేత్తలు కూడా విద్యార్థుల సృజనాత్మకతను మెరుగుపరిచేందుకు క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖనం, పోస్టర్ ప్రెజెంటేషన్, ఫొటోగ్రఫీ పోటీలు, ఇస్రో మానియా, బిజ్‌విజ్ వంటి వినూత్న కార్యక్రమాలు నిర్వహించి ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతులు ఇస్తున్నారు. శుక్రవారం జరిగిన క్విజ్ పోటీల్లో 2 వేలకు పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ నెల 8 వరకు ప్రదర్శన కొనసాగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రూ.12 లక్షల బంగారు ఆభరణాల చోరీ

- పీఎంపాలెం ఆర్‌హెచ్ కాలనీలో ఘటన



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

పీఎంపాలెం: స్థానిక ఆర్‌హెచ్‌కాలనీలో చోరీ జరిగింది. సుమారు రూ.12 లక్షల విలువ గల ఆభరణాలు చోరీకి గురయ్యాయి. పీఎంపాలెం క్రైం ఇన్‌చార్జి సీఐ రమేష్ తెలిపిన వివరాలివీ.. ఆర్‌హెచ్ కాలనీలోని ఇంటి నంబర్ 7-23లో కె.ధనుంజయరావు తన భార్య స్వర్ణలత, కుమార్తెలతో కలిసి నివసిస్తున్నారు. అతని భార్య తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో గత శుక్రవారం నగరంలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. అతను భార్యకు తోడుగా ఆస్పత్రిలోనే ఉన్నారు. కుమార్తెలు ఇంటిని కనిపెట్టుకుంటూ రాత్రి వేళల్లో సమీపంలోని బంధువుల ఇంటి వద్ద నిద్రపోతున్నారు. కాగా.. శుక్రవారం ఉదయం 11.30 గంటల సమయంలో ధనుంజయరావు ఇంటి తలుపులు తెరిచి ఉండటం గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు ఈ విషయం తెలిపారు. వెంటనే వారు వెళ్లి చూడగా.. బెడ్‌రూమ్‌లోని నగలు భద్రపరిచిన బీరువా తెరిచి ఉంది. గదిలో వస్తువులు, దుస్తులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలోని బంగారు హారం, నక్లెస్, నాలుగు గాజులు, చెవి కమ్మలు, ఎత్తు గొలుసులు, ఉంగరాలు, స్టెప్ గొలుసు, కాళ్ల పట్టీలు తదితర రూ.12 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు చోరీకి గురయినట్లు గుర్తించారు. చోరీ అయిన వాటిలో బంధువుల ఆభరణాలు ఉన్నట్లు బాధితులు తెలిపారు. సమాచారం అందుకున్న ఏడీసీపీ నాగన్న, క్రైం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్లూస్ టీమ్‌ను రప్పించారు. కుటుంబ సభ్యులను విచారించారు. బాధితుడు ధనుంజయరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

సైకిల్ యాత్రకు స్పందన కరువు

కొమ్మాది : స్కిల్ డెవలెప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా ఆ పార్టీ సైకిల్ ర్యాలీ నిర్వహించాలని ఆదేశించింది. అయితే జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లో శుక్రవారం నిర్వహించిన సైకిల్ యాత్రకు స్పందన కరువైంది. పట్టుమని పది మంది కూడా లేకపోవడంతో ఈ యాత్రను విరమించుకున్నారు. వార్డులో టీడీపీ, జనసేన నుండి కూడా ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఎవరూ రాకపోవడంతో తెలుగు తమ్ముళ్లు ఈ యాత్రను ముగించేశారు.

రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు గుడిలోవ విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆనందపురం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు మండలంలోని గుడిలోవ విజ్ఞాన్ విహార్ విద్యార్థులు ఎంపికైనట్టు పాఠశాల యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. పాఠశాలలో వివిధ తరగతుల్లో చదువుతున్న రోషన్, కిరణ్‌తేజ, విష్ణువర్ధన్, చైతన్య, రోహిత్ కృష్ణకాంత్, పవిత్ర, లక్ష్మి వినీల రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అలాగే విద్యా భారతి ఆధ్వర్యంలో అఖిల భారత స్థాయిలో నిర్వహించిన బాక్సింగ్ పోటీల్లో యోగితా కుమారి, వరలక్ష్మి రజత పతకాలు సాధించారు. ఈ మేరకు విద్యార్థులను ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు.

రిమాండ్ ఖైదీ మృతిపై 12న విచారణ

మహారాణిపేట: రిమాండ్ ఖైదీ రొంపల్లి రామకృష్ణ మృతిపై ఈ నెల 12న ఉదయం 11 గంటలకు మెజిస్టీరియల్ విచారణ చేపడుతున్నట్లు భీమిలి ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డి తెలిపారు. కొత్తవలసకు చెందిన రాంపల్లి రామకృష్ణ రిమాండ్ ఖైదీగా శిక్ష అనుభవిస్తున్నాడు. ఈ క్రమంలో అనారోగ్యానికి గురి కావడంతో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ ఏడాది సెప్టెంబర్ 13న ఆయన మృతి చెందాడు. దీనిపై మెజిస్టీరియల్ విచారణ చేపట్టాలని నిర్ణయించి.. భీమిలి ఆర్డీవోను విచారణాధికారిగా నియమించారు. ఈ నేపథ్యంలో భీమిలి ఆర్డీవో కార్యాలయంలో ఆ రోజు ఉదయం 11 గంటలకు విచారణ చేపడుతున్నామని.. రామకృష్ణ మరణం గురించి తెలిసిన వారు లిఖిత పూర్వకంగా సమాచారం ఇవ్వాలని ఆర్డీవో కోరారు.

నిరంతర సాధనతోనే లక్ష్య సాధన



కేజీబీవీ విద్యార్థులతో ఇస్రో శాస్త్రవేత్తలు

ఆనందపురం : విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను సాధించాలంటే నిరంతరం సాధన చేయాలని ఇస్రో శాస్త్రవేత్తలు చెప్పారు. మండలంలోని నేల్తేరులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఇస్రో శాస్త్రవేత్తలు జి.అప్పన్న, పి.సాయికృష్ణ కౌశిక్, రామాంజనేయులు శుక్రవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సమావేశమయ్యారు. అక్కడ విద్యార్థులు ఇటీవల చంద్రయాన్-3తో పాటు పలు అంతరిక్ష పరిశోధనలపై నిర్వహించిన పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పలు నమూనాలను తయారు చేశారు. దీంతో వాటిని పరిశీలించిన శాస్త్రవేత్తలు విద్యార్థులను మరింత ప్రోత్సహించడానికి పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ఉన్నత స్థానాలు అధిరోహించిన అబ్దుల్ కలాం, కల్పనా చావ్లా వంటి వారందరూ ఒకప్పుడు సామాన్యులే అని చెప్పారు. వారి నిరంతర శ్రమ, కఠోర సాధన వలన అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకొని గుర్తింపు పొందారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీసీ శ్రీనివాసరావు, పాఠశాల ప్రత్యేకాధికారి ఎం.చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయిని తీరుపై తల్లిదండ్రుల నిరసన



ఆర్‌హెచ్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ సునీత

పీఎం పాలెం : స్థానిక మండల పరిషత్ ఆదర్శ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయిని తీరుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. తరగతి గదిలో విద్యా బుద్ధులు నేర్పవలసిన గురువు అసభ్యకర విషయాలు బోధించడంతో విద్యార్థులు ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు చెప్పడంతో హెచ్‌ఎంకు ఫిర్యాదు చేశామన్నారు. దీంతో ప్రధానోపాధ్యాయుడితో గొడవకు దిగడంతో అప్పటికే అనారోగ్యంగా ఉన్న ఆయన గుండె నొప్పితో ప్రాణాలు విడిచారన్నారు. ఈ చేష్టల వల్ల పిల్లలు ఇబ్బంది పడుతున్నట్టు వారు వాపోయారు. ఉపాధ్యాయిని బెడద తప్పించాలని కోరుతూ శుక్రవారం మరణించిన హెచ్‌ఎం ఫ్లెక్సీ పట్టుకుని నినాదాలు చేశారు. దీంతో తల్లిదండ్రుల వలస ప్రమాదం ఉందని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ సునీత, సిబ్బంది పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయినిని బయటికి పంపించారు. అనంతరం మిగిలిన ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వివరాలు సేకరించారు. ఈ విషయమై చినగదిలి ఎంఈవో రవీంద్రబాబును వివరణ కోరగా పేరెంట్స్ నుంచి రాతపూర్వకంగా ఫిర్యాదు అందలేదన్నారు. సంబంధిత ఉపాధ్యాయినిని వేరే పాఠశాలకు బదిలీ చేశామన్నారు.

రేడియేషన్ ప్రభావంపై పరిశోధనకు అవకాశాలు



ప్రసంగిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ బల్వేందర్ సప్రా

కొమ్మాది : మానవ ఆరోగ్యంపై రేడియేషన్ ప్రభావం ఏ విధంగా ఉందో అధ్యయనం చేయడానికి పరిశోధనలకు విస్తృత అవకాశాలు ఉన్నాయని ముంబైలో బాబా అణుశక్తి పరిశోధనా కేంద్రం మెడికల్ గ్రూప్ అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ కె. బల్వేందర్ సప్రా అన్నారు. గీతంలో శుక్రవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో మానవ ఆరోగ్యంపై రేడియేషన్ ప్రభావం, పరిశోధన అవకాశాలపై ఆమె ప్రసంగించారు. వాతావరణంలో ఉండే రేడియేషన్ మానవ ఆరోగ్యంపై పెద్దగా ప్రభావం చూపదని అయితే క్యాన్సర్ చికిత్స, ఎక్స్‌రేల వినియోగంలో జరిగే రేడియేషన్‌ను తాము అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. గగన్‌యాన్ అంతరిక్ష ప్రయోగంలో వ్యోమగామిపై రేడియేషన్ ప్రభావంపై తీసుకునే జాగ్రత్తలను అధ్యయనం చేసే అవకాశం తమకు లభించిందన్నారు.

బాధిత కుటుంబాలకు భరోసా



తాటితూరులో బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ఎంపీపీ వాసురాజు తదితరులు

తగరపువలస : తాటితూరు పంచాయతీ యాతపేటలో గురువారం రాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా వానపల్లి బంగారమ్మ, కాకర మంగ కుటుంబాలకు చెందిన రెండు తాటాకు ఇళ్లు కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించింది. ఈ మేరకు బాధితులకు సర్పంచ్ శిరిగుడి సంతోషి, ఈశ్వరరావు దంపతులు నిత్యావసర సరుకులు, వంటపాత్రలు, బట్టలు అందించారు. శుక్రవారం భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు బాధిత కుటుంబాలను పరామర్శించారు. తక్షణ సాయంగా రూ.10 వేలు అందించి వీరి ఇళ్లు తాటాకు లేదా రేకులతో పునరుద్ధరించుకుంటే అయ్యే మొత్తాన్ని అందించడానికి సంసిద్ధత వ్యక్తం చేశారు. ఆయనతో పాటు బాధితులను మండల పార్టీ అధ్యక్షుడు గాడు శ్రీను తదితరులు పరామర్శించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ఆనందపురం : ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించే ఆటో డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని నార్త్ ట్రాఫిక్ సీఐ వెంకటరావు హెచ్చరించారు. మండలంలోని బోయిపాలెం, వేములవలస మార్కెట్, వేములవలస జంక్షన్, పాత బస్టాండ్, భీమిలి క్రాస్‌రోడ్డు ఆటో స్టాండ్లకు చెందిన డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటార్ వాహనాల చట్టం ప్రకారం ముందు సీట్లో ప్రయాణికులను కూర్చోబెట్టరాదని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, అందరూ విధిగా యూనిఫామ్, లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ రఘురామ్, సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

జీవో నంబర్ 21 రద్దు కోరుతూ ధర్నా

మధురవాడ : తమకు నష్టం కలిగించే జీవో నంబర్ 21ని తక్షణమే రద్దు చేయాలని ఆటో రిక్షా కార్మికులు డిమాండ్ చేశారు. శుక్రవారం జీవీఎంసీ మధురవాడ జోన్-2 ఆఫీసు ఆవరణలో గల అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు.జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం నగర అధ్యక్షుడు పి. రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఆ జీవో వల్ల రాష్ట్రంలో ఆటో రిక్షా కార్మికులతో పాటు, అన్ని రకాల రవాణా కార్మికులు, చిన్నస్థాయి యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దీనికి వ్యతిరేకంగా విజయవాడలో చేస్తున్న ధర్నాలో భాగంగా ఇక్కడ నిరసన చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మధురవాడ జోన్ ఆటో యూనియన్ అధ్యక్షుడు పి. చిన్నారావు, రమేష్‌బాబు రాము తదితరులు పాల్గొన్నారు.

వివక్ష లేని పాలన జగనన్నకే సాధ్యం

ఎమ్మెల్యే ముత్తంశెట్టి



గణేష్‌నగర్‌లో లబ్ధిదారులకు పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ : వివక్ష లేని పాలన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 5వ వార్డు గణేష్‌నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ముత్తంశెట్టి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వారా జరిగిన మేలును వివరించి సంక్షేమ పథకాల బ్రోచర్లు లబ్ధిదారులకు అందజేశారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పట్టాల సమస్య పరిష్కరించాలని, స్వతంత్రనగర్ నుంచి రైతు బజార్ వరకు భారీ కాల్వ నిర్మాణం, కమ్యూనిటీ హాలు, వీధి లైట్లు తదితర సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పట్టాల సమస్యపై ఆయన స్పందిస్తూ అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

రూ. 4 లక్షలతో స్వతంత్రనగర్‌కు నీరు..

జీవీఎంసీ 7వ వార్డు స్వతంత్రనగర్ పార్కు వద్ద ఉన్న కాలనీకి రూ. 4 లక్షల వ్యయంతో నీరు అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇచ్చిన హామీలో భాగంగా ఇక్కడ రూ. 10 వేల లీటర్ల ట్యాంక్ ద్వారా నీరు అందిస్తున్నారు.

మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతరావు, 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, జేసీఎస్ ఇన్‌చార్జి పోతిన సురేష్‌కుమార్, కుడితి రామారావు, కాశ్మీర్ అప్పారావు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు పీకేఎం పాత్రుడు, పిల్లా సూరిబాబు, శేఖర్, బెల్లాపు పాపారావు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు పెంద్ర అప్పన్న, జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి కోసం స్థల పరిశీలన



మధురవాడ హైవే మార్కెట్ వద్ద స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్ కేంద్రం చంద్రంపాలెం హైస్కూల్ వద్ద జాతీయ రహదారిపై ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం హైవే, జీవీఎంసీ అధికారులు స్థల పరిశీలన చేశారు. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నందున ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ఆవశ్యకతపై పత్రికల్లో వార్తలు ప్రచురితమయ్యాయి. దీనిపై ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అధికారులతో చర్చించి, తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ నేపథ్యంలో అధికారులు స్థల పరిశీలన చేశారు. ఇక్కడ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి హైవే స్థలం సరిపోవడం లేదని, మరికొంత స్థలం అవసరం ఉన్నందున అనుమతి కోసం రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని చెప్పారు. బ్రిడ్జి నిర్మాణానికి 9 నెలలు సమయం పడుతుందని, రూ.3 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. రాష్ట్రప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే హైవే అథారిటీ దృష్టికి తీసుకువెళ్లి ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేస్తామని అధికారులు తెలిపారు. హైవే అధికారులు కరీం, శ్రీరాం, జీవీఎంసీ అధికారులు శాంతిరాజు, వంశీ, వరప్రసాద్ తదితరులున్నారు.